## క్లుప్తంగా

### అక్రమ నిర్మాణాల నిలిపివేత



**కారెంపూడి:** దాచేపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పక్కన ఉన్న ఎస్సీ శ్మశాన వాటిక పక్కనున్న ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ కట్టడాలను తహసీల్దార్ జి.శ్రీనివాస్ సోమవారం నిలిపివేశారు. సర్వే నంబరు 299బీలో 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని దానిలో 35 సెంట్లు ఎస్సీల శ్మశాన వాటిక కింద ఉందని మిగతా ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందన్నారు. ఎస్సీలు ప్రస్తుతం ఉన్న భూమి చాలడం లేదని మరికొంత స్థలం కేటాయించాలని మర్రి శేషయ్య తదితరులు కోరారని పేర్కొన్నారు. అయితే ఖాళీగా ఉన్న భూమిని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అక్రమ నిర్మాణాలను నిలిపివేయించి, హెచ్చరించడం జరిగిందని తహసీల్దార్ పేర్కొన్నారు.

### 7న ఇళ్ల పట్టాల పంపిణీ

**పిడుగురాళ్ల:** ఈనెల 7న పట్టణంలోని వల్లెల గార్డెన్‌లో హౌసింగ్ శాఖ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. పట్టణంలోని 1450 మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. వారికి పట్టణంలోని స్వర్ణ పిచ్చయ్య కాలనీ వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్ నందు, ఆదర్శనగర్–2 ప్రాంతంలో ఏర్పాటు చేసిన లే అవుట్‌లలో ఇళ్ల పట్టాలు అందించనున్నట్లు తెలిపారు. గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాల అందించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు పొందేందుకు కార్యక్రమానికి హాజరు కావాలని తెలియజేశారు.

### నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

**మాచవరం:** మండలంలోని గంగిరెడ్డిపాలెం, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ సర్వే చేపట్టి, ప్రజా అవసరతలను బట్టి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కావున సంబంధిత శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని తెలియజేశారు.


### డెంగీ నివారణ మాసోత్సవం ర్యాలీ

**పిడుగురాళ్ల:** డెంగీ వ్యాధి నివారణతో ఆరోగ్యం పదిలమని పట్టణ ప్రభుత్వ వైద్యాధికారిణి రమాదేవి అన్నారు. పట్టణంలోని పీహెచ్‌సీలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారించవచ్చన్నారు. దోమల నివారణకు ఇంటి ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలన్నారు. దోమలను నిర్మూలిస్తే డెంగీని నియంత్రించవచ్చన్నారు. సీహెచ్‌ఓ హర్షవర్ధన్, పీపీఎం మనోహర్, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ మహమ్మద్ ఖలీం, సిబ్బంది రవి, షేక్ రహీం, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### అమ్మవారి ఆలయం ఆర్చివద్ద వృద్ధుడు మృతి

**దుర్గి:** మండలం పరిధిలోని అడిగొప్పల గ్రామ శివారు నిదానంపాటిలక్ష్మీ అమ్మవారి ఆలయం ఆర్చి వద్ద వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కె.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కురిచేడు మండలం భోజనంపాడు గ్రామానికి చెందిన బత్తుల అనంతయ్య (60) ఆదివారం కుటుంబ సభ్యులు బంధువులతో నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కుటుంబ సభ్యులు తిరిగి వారికి స్వగ్రామానికి వెళ్లిపోగా మృతుడు అనంతయ్య దుర్గిలో వ్యవసాయానికి పురుగు మందు తీసుకొని వస్తానని కుటుంబ సభ్యులకు తెలిపి రాత్రి ఇక్కడే బస చేశాడు. తెల్లవారిన తర్వాత భక్తులు అమ్మవారి ఆలయ ఆర్చివద్ద అనంతయ్య మృతి చెందడం కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతిగా మద్యం సేవించి నందునే అనంతయ్య మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### కల్యాణ కానుక అందజేత



**దాచేపల్లి:** చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పిటల్ ఆధ్వర్యంలో కల్యాణ కానుకను సోమవారం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని మన్సూర్‌షాపేటకు చెందిన షేక్ ఖాసీంసాహెబ్, మస్తాన్‌బీల కుమార్తె సుమమ్మ వివాహం సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్ చేతుల మీదుగా ఉంగరం, పట్టుచీర, సారెను అందించారు. తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవ కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని డాక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు.

# సమస్యలకు సత్వర పరిష్కారం

- ఆర్డీఓ కె.అద్దెయ్య
- గ్రామ గ్రామాన ఘనంగా జగనన్న సురక్ష కార్యక్రమాలు



కారెంపూడిలో లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీపీ శారదా శ్రీనివాసరెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి



మాదినపాడులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం



గోలి గ్రామంలో సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, తహసీల్దార్ పుల్లారావు



మాచర్లలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్

**గురజాల:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రెవెన్యూ డివిజన్ అధికారి కె.అద్దెయ్య సూచించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యల వల్ల అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోతే ఆ సమస్యలు తొలగించి అర్హులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష పథకం సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురికి పలు రకాల సేవలకు సంబంధించిన పత్రాలను అందించారు. వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, తహసీల్దార్ మీసాల దానియేలు, ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్ నాయక్, సెక్రటరీ శివకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**దాచేపల్లిలో...**

**దాచేపల్లి:** ప్రజా సమస్యల పరిష్కరం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వస్తోందని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదినపాడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పలు సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంజూరు చేసిన సర్టిఫికెట్లను అందించారు. జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులను గ్రామాలకు పంపిస్తున్నారని చెప్పారు. సమస్యలపై దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అక్కడికక్కడే అందిస్తున్నామని ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ కందుల జాను, తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ శోభారాణి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, సర్పంచ్‌లు అనుముల అంజిరెడ్డి, తాటిపర్తి నర్సిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**కారెంపూడిలో...**

**కారెంపూడి:** ఏ ఒక్కరు కూడా సంక్షేమ పథకాలు అందకుండా బాధపడకూడదని, అలాగే వివిధ రకాల ధ్రువ పత్రాల కోసం ఇబ్బందులు పడకూడదని అలాంటి వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జి.శ్రీనివాస్ గాదెవారిపల్లెలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు తెచ్చేందుకు అధికారులందరం గ్రామానికే వచ్చామన్నారు. సభా కార్యక్రమం అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన అర్జీలను అధికారులు పరిష్కారం చేసి వారికి ధ్రువపత్రాలను అందించారు. మొత్తం 15 రకాల సేవలకు సంబంధించి వచ్చిన 268 అర్జీలను అధికారులు పరిష్కారం చేశారు. వలంటీర్లు గుర్తించిన సమస్యలతో పాటు అప్పటికప్పుడు వచ్చిన అర్జీలను కూడా అధికారులు పరిశీలించారు. అలాగే జగనన్నకు చెబుదాం.. సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి వచ్చిన ప్రజలకు మంచి ఏర్పాట్లు చేసి రాగిజావ అందించారు. గాదెవారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని శివారు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఏఓ బి.యలమందారెడ్డి, డీటీ కీర్తిసుధాస్రవంతి, ఈఓపీఆర్డీ కె.సత్యప్రసాద్, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**రెంటచింతలలో...**

**రెంటచింతల:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఒక వరం అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని గోలి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను క్షేత్రస్థాయిలోనే ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో పాటు గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ, రైస్‌కార్డు, కుల, ఆదాయ తదితర మొత్తం 103 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నా చంద్రశేఖర్, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, ఈవోపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, వీఆర్వో పాశం నాసర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

**దుర్గిలో..**

**దుర్గి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎ.సూరి సాయి శంకర్ కోరారు. అడిగొప్పల సచివాలయం –2 పరిధిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలానికి చెందిన ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి ప్రజల సమస్యలను, ప్రభుత్వం అందిస్తున్న సేవలను నేరుగా ప్రజలకు అందేలా చేయడం గొప్ప విషేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 277 వినతులను అధికారులకు సమర్పించగా, 269 మందికి వివిధ రకాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎం.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి తదితరులు పాల్గొన్నారు.

**మాచర్లలో..**

**మాచర్ల:** పట్టణంలో జగనన్న సురక్ష పథకాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంలో అప్పటికప్పుడు ధ్రువీకరణ పత్రాలు, పథకాలు అందజేసేందుకు ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు, వార్డు కౌన్సిలర్ కోలా శ్రీను, మున్సిపల్ మేనేజర్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వచ్చిన 25దరఖాస్తులను పరిశీలించి, జనన, మరణ, కుల, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

# ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

**సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)**



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక వర్గం

**గురజాల:** ఆలయ కమిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) సూచించారు. స్థానిక పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయం కల్యాణ మండపంలో దేవాలయ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొమ్మినేని మాట్లాడుతూ నూతన పాలక వర్గం దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**వైభవంగా ప్రమాణ స్వీకారమహోత్సవం..**

నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. నూతన పాలకవర్గ చైర్మన్‌గా కనకం ఆదినారాయణ దత్తు, కమిటీ మెంబర్లుగా రెంటాల నాగేశ్వరరావు, వడితే శిరీషభాయ్, నట్టువ సీతమ్మ, కుక్కమూడి సుందరమ్మ, రావుట్ల రామబ్రహ్మాచారి, అన్నందాసు నరసమ్మలచే సత్తెనపల్లి దేవదాయ ధర్మదాయ ఇన్‌స్పెక్టర్ నీలావతి ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా కమిటీ పాలకవర్గం సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, నగర పంచాయతి వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాగుల్‌మీరా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బి.ఇష్ట కామిరెడ్డి, చిట్టిమాల లక్ష్మణ్‌రావు, కావూరి అంజిబాబు, దేవాలయం కమిటీ మాజీ చైర్మన్ గుండా సురేష్ బాబు తదితరులున్నారు.

# వాసవి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**మాచర్ల:** పేదలు, వృద్ధులకు సహాయం అందించడంలో వాసవి వనితా సభ్యులు ఎల్లప్పుడు ముందుంటారని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ మామిడి శ్రీనివాసరావు, గౌరవ అతిథి పి.వెంకటసత్యనారాయణలు అన్నారు. సోమవారం పట్టణంలో మహిళలకు చీరలు, సైనిక ఉద్యోగులకు సన్మానం, రైతులకు పురుగు మందులు, విత్తనాలు పంపిణీ, జమ్మలమడగ రహదారిలో రెండు సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వాసవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు రెండు నెలల సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. వాసవి క్లబ్ మాచర్ల అధ్యక్షుడు ఓరగంటి చెన్నకేశవులు, మహిళ అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, జోన్ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు, రీజనల్ చైర్మన్ వి.కేశవరావు, సభ్యులు పి.నరసింహారావు, చుండూరు సత్యనారాయణ, ఎం.నాగార్జున, బి.రాజ్‌కుమార్, పి.ధనలక్ష్మి, డాక్టర్ వి.హరీష్, రంగాచెన్నకేశవులు పాల్గొన్నారు.

**వాసవి క్లబ్ సేవా కార్యక్రమం**

**కారెంపూడి:** వాసవి క్లబ్ ప్రతినిధులు సోమవారం కారెంపూడిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య పేదలు నలుగురికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, గ్రామ పంచాయతీ కార్మికులకు దుప్పట్లు, టవల్స్, అలాగే పేద రైతుకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. మాజీ సైనికోద్యోగి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. క్లబ్ రాష్ట్ర ప్రతినిధి కొత్తా ముక్తేశ్వరరావు, తవ్వా నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# జనసేన నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి

**దాచేపల్లి:** జనసేన నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డిపై జనసేన నాయకులు చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై జనసేన నాయకులు అసత్య ఆరోపణలు చేయటం మానుకోవాలని నేతలు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దగ్గర కొంతమంది జనసేన నాయకులు నెలవారీ జీతాలు తీసుకుంటూ, జనసేన జెండాలు మోస్తున్నారని, జనసేన జెండాలు అడ్డంపెట్టుకుని ప్రభుత్వ అధికారులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా జనసేన నాయకులు నియోజకవర్గంతో పాటుగా నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధిని గమనించాలని, ప్రతిపక్ష పార్టీలు సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, అభివృద్ధికి అడ్డుతగిలితే ప్రజలు తగినబుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వారు చెప్పారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, యువజన విభాగం నేతలు కొప్పుల కృష్ణ, మునగా శ్రీనివాసరావు, కొమ్ము బుజ్జి పాల్గొన్నారు.

### అమ్మవారి హుండీ ఆదాయం రూ.34 లక్షలు



**దుర్గి:** నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి హుండీ ఆదాయం దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. 40 రోజులు పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, లెక్కించగా రూ. 34,23,435 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గిరి రాజు నరసింహబాబు తెలిపారు. ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పేటసన్నెగళ్ళ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణ అధికారి సైదమ్మబాయి పర్యవేక్షించారు. నగదును బ్యాంకు అధికారులకు అందజేసి తగిన రసీదును ఆలయ అధికారులు పొందారు. లెక్కింపును కొనసాగించిన వారిలో కరాలపాటి సుబ్బారావు, కలవల వెంకటేశ్వర్లు, కొత్త నరసింహారావు, నాగారపు ఆంజనేయులు, ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, భక్తులు పాల్గొన్నారు.

### మద్యం సీసాల తరలింపు అవాస్తవం

**ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ వలీ**

**మాచర్ల:** మాచర్లలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు వచ్చిన మద్యం బాటిళ్లు బార్లు, బెల్టుషాపులకు తరలిస్తున్నారనేది అవాస్తవమని తమ పరిశీలనలో తేలినట్లు నరసరావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ వలీ సోమవారం తెలిపారు. 'అక్రమ మద్యం వ్యాపారం' శీర్షికన ఓ పత్రిక(సాక్షి కాదు)లో వచ్చిన కథనంపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూడు బార్‌లలో తనిఖీలు చేశామని ప్రభుత్వానికి చెందిన మద్యం బాటిళ్లు లభించలేదన్నారు. పట్టణంలో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం విక్రయాలు పరిశీలించి, ఎక్కువ మొత్తంలో విక్రయించినట్లు నిర్ధారణ కాలేదని తమ పరిశీలన తేలినట్లు వెల్లడించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి పట్టణంలో బార్‌లకు మద్యం సీసాలు తరలిస్తున్నారన్నది అవావస్తం అన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు, బార్‌లలో అన్ని రకాల మద్యం బాటిళ్లు పరిశీలించినట్లు తెలిపారు. బార్ నిర్వాహకులకు మద్యం తరలించాల్సిన అవసరం లేదని తాము గుర్తించినట్లు ఆయన చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఓ పత్రికలో గతనెల 30న ఈ అవాస్తవ కథనం ప్రచురించడాన్ని ఆయన ఖండించారు. నిత్యం మద్యం షాపులు, బార్‌లలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



పాలువాయి జంక్షన్‌లో పూజలు అందుకుంటున్న సాయిబాబా



శ్రీ సత్యసాయి ప్రేమ మందిరంలో గురుపౌర్ణమి పూజలు

**రెంటచింతల:** మండలంలోని వివిధ గ్రామాలలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం భక్తులు ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడీసాయి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురుపౌర్ణమి రోజు బాబాను పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడులోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని రెంటచింతల శ్రీ శివరామకృష్ణ సేవామందిరంలో పొట్టి మూర్తి రామతులశమ్మ నేతృత్వంలో సాయిబాబా సాలీస భజనా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


**కారెంపూడి:** గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం షిరిడీ సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆర్యవైశ్య వీధిలోని షిరిడీ సాయి మందిరంలో, అంకాలమ్మ గుడి సెంటర్‌లోని షిరిడీ సాయి మందిరంలో, అలాగే ఎస్ఎస్‌పీ కాలనీలోని బాలనాగసాయిబాబా, గాదెవారిపల్లె గ్రామంలోని షిరిడి సాయిబాబా ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవతో పూజలు మొదలై వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గురజాల:** గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. స్వామి వారికి పలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారికి నీటిని వారుగా పోసి మహిళలు స్వాగతం పలికారు.

**మాచర్ల:** గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సొసైటీ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో దేవాలయ నిర్వాహకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పత్తిఫ్యాక్టరీ ఆవరణలోని సత్యసాయిబాబా దేవాలయంలో కన్వీనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని గురుపౌర్ణమి సందర్భంగా పాత మాచర్ల దేవాలయంలో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

**విజయపురిసౌత్:** స్థానిక సత్యసాయి ప్రేమ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఆలయ ధర్మకర్త కె.శ్రీహరిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు హనుమంతాచారి ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి కాగడ హారతి, శ్రీ షిరిడి సాయిబాబా మంగలస్నానం, గణపతి పూజ, క్షీరాభిషేకం, సహస్రనామ పుష్పయార్చన, స్వామివారిని పల్లకిలో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భజన మండలి సభ్యులచే సాయి ఏకాహం నిర్వహించారు. మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాగర్ ప్రాజెక్టు రిటైర్డ్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, వసంతకుమార్ రెడ్డి, జెన్‌కో ఏడీ నాగరాజు, ఫ్లైటెక్ ఏవియేషన్ డైరెక్టర్ కెప్టెన్ మమత, ఆలయ కమిటీ సభ్యులు జానారెడ్డి, సాయి, జీవీజీ కృష్ణమూర్తి, రామకృష్ణ, రాజేష్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

# శాకంబరి మాతగా చౌడేశ్వరీ అమ్మవారు



శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చిన చౌడేశ్వరీ అమ్మవారు

**రెంటచింతల:** స్థానిక బాలవికాస్ స్కూల్ సమీపంలో కొలువై నమ్మినవారికి నీడలా కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్న జగన్మాత చౌడేశ్వరీ అమ్మవారు, సత్రశాల వద్ద ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శాకాంబరి మాత అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవస్థానాల ప్రధాన అర్చకులు పి.అనీల్‌కుమార్ శర్మ, చిట్టేల శివశర్మల నేతృత్వంలో శాకంబరి మాత మహోత్సవంలో భాగంగా పూలు, పండ్లు, పలు రకాల కూరగాయలు, వివిధ రకాల ఆకులతో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శాకంబరి మాత అలంకారాలలో దర్శనమిచ్చిన అమ్మవార్ల కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి, పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**దాచేపల్లి:** ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పూజలు చేశారు.

# తలదించుకునే పరిస్థితి పోలీసులకు లేదు

**మాచర్ల అర్బన్ సీఐ బాలకృష్ణ**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

**మాచర్ల:** రాష్ట్ర పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుంటే 'తలదించుకుంటున్న ఖాకీ' అంటూ ఓ దిన పత్రిక (సాక్షి కాదు)లో కథనం ప్రచురించడం హాస్యాస్పదంగా ఉందని అర్బన్ సీఐ బాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ పోలీసులు తలదించుకుని ఎప్పుడూ పని చేయరని, తల ఎత్తుకుని ఉద్యోగాలు చేస్తారని వెల్లడించారు. ప్రతి పోలీసు తన బాధ్యతలను చట్టానికి లోబడి చేస్తారని, అందుకు భిన్నంగా తలదించుకోవాల్సిన పరిస్థితి పోలీసులకు లేదని స్పష్టం చేశారు. ఎస్పీపై ఉద్దేశ్యపూర్వకంగా కథనాలు ప్రచురించడం అవివేకానికి నిదర్శనమన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి 15 నెలలుగా శాంతి భద్రతల సమస్య ఏర్పడకుండా సమర్థవంతంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని నడిపిస్తున్నారన్నారు. శాంతిభద్రతలు తలెత్తే అవకాశం ఉన్న ప్రతి ప్రాంతాన్ని ఎస్పీ సందర్శించి ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న విషయాన్ని సహించలేక కొన్ని రాజకీయ పార్టీలు బురదజల్లే యత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ గొడవలు సృష్టించడంతోపాటు, రోడ్లపై బైఠాయించి ట్రాఫిక్‌ను గంటల తరబడి స్తంభింపచేసి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మాచర్ల పట్టణంలో శాంతిభద్రతలు కాపాడే పోలీసు సిబ్బందిపై ఇలాంటి కథనాలు రాస్తే సహించబోమన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రొటోకాల్ ప్రకారం భద్రత కల్పించడం మాబాధ్యత అన్నారు. ఆయన సోదరుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి ప్రభుత్వం సెక్యూరిటీ కల్పించిందన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా పోలీసు వ్యవస్థను కించపరిచేవిధంగా ఓ పత్రిక అవాస్తవాలు రాయడం ఖండిస్తున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

### క్షుద్ర పూజల కలకలం!

**దాచేపల్లి:** స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేశారు. పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో కోడిని కోసి అక్కడే పడేశారు. ఆ స్థలంలో రక్తం చల్లారు. పసుపు, కుంకుమను కూడా అక్కడ చల్లించారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు.

### అర్హులకు ధ్రువీకరణ పత్రాలు

**పలుదేవర్లపాడు(ముప్పాళ్ల):** జగనన్న సురక్షలో భాగంగా అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించటం జరుగుతుందని ఎంపీడీఓ పీ పుట్టారెడ్డి చెప్పారు. మండలంలోని పలుదేవర్లపాడులో మంగళవారం జరగనున్న జగనన్న సురక్షలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న వారి వద్దకు సోమవారం వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.